

తిరువనంతపురం (త్రివేండ్రం) ఎక్స్‌ప్రెస్ మొదటి తరగతి స్త్రీల పెట్టెలో మాధవి ఒంటరిగా కూర్చుంది. రైలు తాంబరందాటి వేగంగా పోతూ ఉంది. మాధవి కిటికీ నుంచి చూస్తూ ఉంటే చెట్లు, చేమలు, పొలాలు, మరుభూములు, కొండలు, గుట్టలు అతి వేగంగా పరుగిడుతున్నట్లు కనబడే దృశ్యం ఆశ్చర్యం, వినోదం కలిగించింది. వేగంగా పోతున్నది రైలు; అందులో కూర్చున్నది తను. బయట కనబడేవన్నీ స్థిరంగా ఉన్నవి. జీవితంలో కూడా ఇదే వింత. మాధవి భావవీధిలో తన జీవితంలోని ఘట్టాలు ఒకటి వెంట ఒకటి మనోవేగంతో పోసాగినవి—కొన్ని స్పష్టంగా, కొన్ని ఊహామాత్రంగా. తల్లి శవందగ్గర నిలుచుకొని అమ్మా, అమ్మా అని ఏడుస్తున్నది అందరూ ఏడవడంచూస్తూ, ఏమీ అర్థం గాకుండా. చెల్లెలు సౌదామినికి రెండేండ్లు. తనకు ఆరేండ్లు. ఆ తర్వాత తండ్రితో, నాయనమ్మతో జీవనం. చెల్లెలిమీద ఎక్కువగా ప్రేమ. ఏడిస్తే బుజ్జగించడం, ఆడించడం, స్కూల్లో చదువుకోవడం, పాట నేర్చుకోవడం, సంగీతం పోటీలో బహుమతి రావడం, క్రమేపీ సంగీతం మీద ఆసక్తి హెచ్చుకావడం, స్కూలు ఫైనల్ పాసుకాగానే చదువు మానేయడం.

తండ్రి విజయవాడలో సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్నప్పుడు అతని స్నేహితుని ద్వారా రేడియోలో పాడడానికి అవకాశం కలిగింది. బసవరాజు అప్పారావు, కృష్ణశాస్త్రి మొదలైన కవులు వ్రాసిన భావ గీతాలు పాడేది.

# తెర

అప్పటికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. తండ్రికి మద్రాసులో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ పని లభించింది. గాంధీనగర్‌లో కొత్తగా కట్టిన ఇండ్లలో ఒకటి సొసైటీ ద్వారా తండ్రి తీసుకొన్నాడు. అక్కడ కాపురం ఉన్నప్పుడే ఫిల్ములలో ప్లేబాక్ పాటకురాలైంది. అనతికాలంలో ప్రఖ్యాతి గడించింది. వివాహం విషయం తలపెట్టేదే కాదు. కాని, మొదట నాయనమ్మ గతించడం, వెనక తండ్రి రిటైరవడం—ఈ సందర్భాల్లో తండ్రి పెండ్లి ఏర్పాటుచేశాడు. గుంటూరులో ప్లీడరు, తండ్రి బాల్యస్నేహితుడు పురాణం రామకృష్ణయ్యగారి కుమారుడు శ్రీధర్, మద్రాసులో అకౌంటెంటుగా పెద్ద కంపెనీలో ఉద్యోగం చేస్తున్నవాడికిచ్చి పెండ్లి చేశారు. భర్త తన సంగీతాభ్యదయానికి ఆక్షేపిస్తాడేమోనని మొదట భయపడ్డది. కాని, అతని ప్రోత్సాహం వల్ల భయం మాయమవడమేగాక తాను అభివృద్ధి చెందింది కూడా. అచిరకాలంలో ప్రతి ఫిల్ములో పాడమని ఆహ్వానాలు వచ్చినాయి. తన అదృష్టానికి తానే మురిసిపోయేది.

పెండ్లి అయిన రెండేండ్లకు కుమార జననం. తండ్రి ప్రహ్లాద అని నామకరణం చేశాడు; మామగారు ఆమోదించారు. మనమడి ముద్దు ఎక్కువ రోజులు చూడడానికి ఇద్దరు తాతలు ఇచ్చిపెట్టుకోలేదు. ఒక్క సంవత్సరంలో ఇద్దరూ దివంగతులైనారు.

చెల్లెలు సౌదామిని కాలేజీలో చదువుకుంటున్నది. తండ్రిపోయిన వెనక తన దగ్గరే ఉండిపోయింది. చిన్నవయసులో తల్లిని కోల్పోయిన కారణంచేత తండ్రి గారాబంతో పెంకెపిల్లగా తయారైంది. ఎవరిమాటా లక్ష్యం చెయ్యదు. తనదారే తనకు. సౌందర్యం, తెలివి, చురుకుదనం, నవనాగరికత అన్నీ మూర్తీభవించిన సౌదామినికి స్నేహితుల కొదవ లేదు. ఆడపిల్లలే కాక యువకులు కూడా ఆమెతో పరిచయాన్ని కోరేవాళ్ళు అనేకులు. అందరితో ఒక్కరీతిగానే ప్రవర్తించేది. 'ఎవరన్నా ఏమనుకుంటారు' అని అక్క మందలిస్తే, 'నాలో ఏ పాప చింతనా లేనప్పుడు ఎవరేమనుకుంటే నాకేమి' అని దురుసుగా బదులుచెప్పేది. తన భర్త సహితమూ ఆమె పక్షాన్నే పలికేవాడు. కాని, తనకు మాత్రం తృప్తి లేదు. ఏ సమయానికి ఏ విపరీత పరిణామం కలుగుతుందో అనే అనుమానం.

మాధవి మనసంతా తన కొడుకు మీదికి వెళ్ళింది. కళ్ళు చెమ్మగిల్లినవి. ఎలా చూచుకొంటారో? భర్త ఉదయం ఆఫీసుకు వెళ్ళిపోతే సాయంత్రానికి గాని రాడు. సౌదామిని ఇంట్లో పట్టుమని పది ఘడియలైనా ఉండదు. మరునాడు ఆదివారం కదా, భర్త ఇంట్లోనే ఉంటాడు అని మనశ్శాంతి తెచ్చుకుంది. 'మళ్లీ మంగళవారానికి వచ్చేస్తానుగా? ఒక్క సోమవారం. స్వామీ, నీ ప్రహ్లాద కుమారుణ్ణి రక్షించు' అని నమస్కారం చేసింది.

తిరుచ్చిరపల్లి దగ్గర కరూరులో నారద గాన సభ వారు సంగీత ఉత్సవం అతి వైభవంగా జరపడానికి ఏర్పాట్లు చేశారు. ఒక రోజు కర్ణాటక సంగీతం. ఒక రోజు హిందూస్తానీ గానం, ఒక రోజు ఫిల్ము పాటలు, సుగమ సంగీతం. ఆ నాటికే తనను కోరారు. మొదట అంతదూరం వెళ్లడానికి సంకోచించింది. ఇంతగా గౌరవించినప్పుడు నిరాకరిస్తే బాగుండదని భర్త చెప్పినందువల్ల ఒప్పుకొంది.

చెంగల్పట్ స్టేషన్‌లో రైలు ఆగింది. ఏమి జన సమ్మర్దం! దిగేవారు, ఎక్కేవారు. సామానులు నెత్తిమీద, చేతుల్లో మోసుకొని వచ్చే కూలీలు. పత్రికలమ్మేవాళ్ళు. తైరుసాదం, సాంబార్ సాదం అని అరుస్తూ వెళ్లేవాళ్ళు, అదుగో, ఎవరో ఒక యువతి, తన పెట్టె దగ్గరికే వస్తున్నది. ఆమె చుట్టూ అనేకులు గుమిగూడి ఆమె ననుసరించి వస్తున్నారు. అందులో ఒకడు, "ఇదో, ఇదుగా లేడీస్ కంపార్ట్‌మెంట్" అన్నాడు. ఒక అమ్మాయి ఆ యువతికి గులాబీ పూలమాల అర్పించింది. కరతాళ ధ్వనులు మోగినాయి. ఆమె అందరికీ నమస్కరించి బండి ఎక్కి ద్వారంలో నిలబడి ఉంది. రైలు బయలుదేరడానికి గంట కొట్టారు. అప్పుడామె లోపలికి వచ్చింది. వచ్చిన వాళ్లలో ఒకరు తలుపు మూసినారు. రైలు కదలగానే ఆమె మాధవి ఎదురు సీటు మీద కూర్చుని నమస్కారం చేసింది. మాధవి కూడా నమస్కరించింది. కొన్ని క్షణాలైన తర్వాత ఆమె అడిగింది ఇంగ్లీషులో—"మీరెక్కడికి వెళ్తున్నారు" అని. మాధవి, "కరూర్" అని చెప్పింది. "అరే!






# తెర

ప్రస్తావించినపుడు డాక్టర్ ప్రసన్నకు తన విద్యను ఉపయోగించడానికి ఇదే తరుణమని ఉత్సాహం కలిగింది. ఆమె చారులత అని వినగానే ఉత్సాహం మరింత హెచ్చింది. ఆమె గానం అనేక పర్యాయాలు రేడియోలో విన్నాడు; మెచ్చుకున్నాడు. అటువంటి ఉత్తమ గాయకురాలికి ముఖంలో కలిగిన లోపాల్ని సరిచేసి కృతకృత్యుడు కావలె నని సంకల్పించుకున్నాడు.

ఒక రోజు తన కోర్కె సూచించాడు. "మీకు నా యందు నమ్మకం ఉంటే ఆపరేషన్ చేస్తాను. మీ సహజసౌందర్యం పునః సృష్టిచేస్తాను."

మాధవి నవ్వింది. "నాకెందుకండి సౌందర్యం! నన్ను చూచి ఆనందించేవాళ్లు ఎవరున్నారు?"

"అది ఏం మాట? గులాబీ తన అందాన్ని చూచి ఇతరులు ఆనందించాలనియేనా అంత రమణీయంగా ఉంటుంది? పోనీలెండి, నేను చూచి సంతోషిస్తాను."

మాధవి బదులు చెప్పలేకపోయింది.

డాక్టర్ సుబ్రహ్మణ్యం సహాయంతో ఆపరేషన్ చేశాడు డాక్టర్ ప్రసన్న. తొడలో చర్మం తీసి ముఖంలోని పీలికలకు అతుకుపెట్టినాడు.

మాధవికి స్మరణ రాగానే ముఖం చుట్టూ కట్లున్నవి. అయితే బాధ అంతగా లేదు. పక్కన నిలబడిఉన్న డాక్టర్ ప్రసన్న ఆదరపూర్వకంగా చిరునవ్వుతో అన్నాడు: "కట్లు విప్పడానికి వారం రోజులు పడుతుంది. భయపడకండి."

మాధవికూడా లేతగా నీరసంగా నవ్వింది.

వారం రోజుల తర్వాత కట్లు విప్పాడు. ఏదో తైలం మృదువుగా ముఖానికి పూశాడు. ప్రతిరోజూ అదే విధంగా చేసేవాడు. పదిరోజులైన తర్వాత డాక్టర్ సుబ్రహ్మణ్యాన్ని పిలుచుకొని వచ్చాడు. అతడు అచ్చెరువంది, ప్రసన్న నేర్పు పొగిడి, అభినందించాడు. సుబ్రహ్మణ్యం వెళ్లిన వెనుక అద్దం తీసుకొని వచ్చి మాధవి చేతి కందించాడు. ఆమె తన ముఖం చూచుకొనింది. ఎంత మార్పు! నిజంగా డాక్టర్ ప్రసన్న ఇంద్రజాలికుడే. ఎంత కరుణామయుడు! కృతజ్ఞతతో నమస్కరించింది. "మీరుచేసిన ఉపకారానికి నేనేమి ఇయ్యగలను?" అన్నది.

"చెప్పనా? మీకు పూర్తిగా శక్తి వచ్చాక పాడండి. విని ఆనందిస్తాను. మీ సంగీతం నాకు చాలా ఇష్టం. సరేనా?"

"ఎందుకండీ నన్ను పరిహాసిస్తారు? నాకు పాట రాదండి."

"అవును. శ్రీమతి చారులతకు సంగీతం రాదుకదూ! ఎవరు నమ్ముతారు?"

"అయ్యో, పొరబడుతున్నారు! నేను చారులతను కాను."

"ఒక్క మాట. మీకు పూర్వ జీవిత స్మృతి ఏమీ లేదా?"

"లేదు" అని, కండ్లు మూసుకుంది. ప్రసన్న విచార స్వాంతుడైనాడు.

• • •

మరి కొన్ని రోజులకు మాధవి లేచి తిరుగుతున్నది. ఆతిథ్యానికి సహితము మితి ఉండవలెనని ఒకనాడు



**గమనిక**

సమీక్షార్థం రెండు ప్రతులు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక. ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2'కు పంపవలసిఉన్నది.

—ఎడిటర్

డాక్టర్‌తో చెప్పింది—"నేనిక వెళ్తాను" అని.

"మీ కిష్టం లేకపోతే వెళ్లవచ్చును."

"అలా అనడం భావ్యంకాదు. మీ ఋణం నేనీ జన్మలో తీర్చలేను. నాకు చికిత్స పూర్తిఅయిందికదా, నర్సింగ్‌హోములో ఊరకే ఉండడం వ్యర్థం కదా అని అన్నాను."

"నిజం. అయితే నా అభిప్రాయం నేను పూర్తిగా చెప్పంది నాదే తప్పు. నా మాటలు సావధానంగా వినండి. నాకు ఎవ్వరూ లేరు. మీకూ ఎవ్వరూ లేరని చెప్పారు. ఈ నర్సింగ్ హోముకు మానేజరుగా ఉండమని నాకోరిక. ఉచితంగా కాదు. రెండు వందలు...."

"రామ రామ! ధనం అపేక్షించి ధనార్జన కోసరం కాదు, నేను వెళ్తానన్నది. మీ దయాగుణం తెలుసును. మీరుగా వెళ్లమనరు. అందుచేత నేనే వెళ్లడం సబబుగా ఉంటుందని అలా అన్నాను. నిజంగా మీకు ఏ విధంగానైనా ఉపకారం చెయ్యగలిగితే ఎంతో సంతోషం!"

"ఇంకొక్క మాట. మేడమీద ప్రత్యేకంగా ఒక గది ఉంది. అందులో మీరు ఉండవచ్చును."

మాధవి మౌనం గ్రహించాడు.

"మీ ఆలోచన అర్థమయింది. అలా మీరు ఉంటే లోకానికి విపరీతంగా తోస్తుంది. మీ శీలాన్నే అనుమానించవచ్చును. మీకు మాడర్న్ హోటల్లో గది ఏర్పాటు చేస్తాను. దినమంతా నర్సింగు హోములోఉండి సాయంత్రం వెళ్లిపోవచ్చును."

"ఇంత కరుణకు నే నెలా అర్హురాలనో నాకు తెలియడం లేదు."

"చెప్పమంటారా? మీరిక్కడికి రాకపూర్వం కొన్ని సంవత్సరాలుగా వైద్యం, చికిత్సమీద తప్ప నాకు ఏ చింతా లేకుండినది. జీవితం రసహీనంగా ఉండేది. నేను డాక్టర్ని. రోగులకు చికిత్సచేయడం నా ధర్మం. ఆ నాధర్మాన్ని పాలిస్తూ ఉండడంతో నాకు సరిపోయేది. తుదకు సంగీతంమీదకూడా అభిలాష తగ్గిపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే—నేనొక జీవంలేనియంత్రం అయిపోయాను. డాక్టర్ సుబ్రహ్మణ్యం మిమ్మల్ని ఈ నర్సింగ్ హోములో చేర్పించినప్పుడు నా మనసులో ఒక పెద్ద కోర్కె కలిగింది. నేను నేర్చుకున్న అపూర్వ విద్యను ఉపయోగించడానికి అవకాశం లభించిందికదా? ఆపరేషన్ జయప్రదంగాచేసి తృప్తిపొందవలెననేకోర్కె. దైవ కృపవల్ల నా కోర్కె సమకూరింది. మీ వదనాన్ని పునః సృష్టిచేసినాను. అయితే... అయితే... క్రమేపి.."

డాక్టరు మాటలు ఆగిపోయినాయి. మాధవి హెచ్చరించింది.

"అయితే?"

"అయితే క్రమేపి మీరు కేవలం ఒక పేషంట్‌గా కాక ఒక మనోహరమైన స్త్రీగా కనబడ్డారు."

మాధవి తల వంచుకొంది.

"మీరు అన్యథా అనుమానించకండి. నా భార్య మృతితోనే నా కామవాంఛ నశించిపోయింది. అయితే సౌందర్య పిపాస, స్త్రీ ప్రకృతిలో ఉన్న విశిష్ట సౌకుమార్యం ఆకర్షణ నాకు పోలేదు. మీవంటి సంస్కార సంపన్నమైన యువతీమణి సాహచర్యంవల్ల నా జీవితంలో ఒక కొత్త వెలుగు ప్రవేశించింది. ఆ వెలుగును దూరం చేసుకొని మళ్లీ అంధకారంతో జీవితాన్ని నింపుకోవడానికి ఇష్టపడక మిమ్మల్ని ఈవిధంగా ప్రార్థించాను. చెప్పమన్నారు గనక చెప్పేశాను. నేను బలవంతం చెయ్యడం లేదు."

"మీయందు నాకు ఏ అనుమానమూ లేదు. మీ ఇష్టప్రకారమే చేస్తాను."

మాధవి ఎంతో ఆసక్తితో శ్రద్ధగా నర్సింగుహోములో మానేజరు పనిచెయ్యడానికి పూనుకుంది. డాక్టర్ ప్రసన్న సంతోషానికి మేరలేదు. నర్సింగ్‌హోముకు ఒక జీవకళ వచ్చినట్లు కనిపించింది. మాధవికికూడా ఒక విధమైన తృప్తి కలిగింది. తన జీవితం నిరర్థకం కాలేదని ఆత్మగౌరవం వచ్చింది.

మూడు నెలలు గడిచినవి. ప్రతినిత్యమూ సమీపంగా సంచరిస్తూ ఉండడంచేత చనువు ఎక్కువయింది. స్నేహం వర్ధిల్లింది. ఆమెను లతా అని పిలిచేవాడు కాని ఆమె మాత్రం డాక్టర్ అనే పిలిచేది.

ఒకనాడు ప్రసన్న ఆమె హోటలుకు వెళ్లిపోతున్నప్పుడు, "ఏమి, లతా, తొందరగా వెళ్లాలా?" అని ప్రశ్నించాడు. మాధవి నవ్వి, "ఏమండీ, ఓవరుటైం పని చెయ్యమంటారా?" అని అడిగింది. ఆమె చమత్కారానికి హర్షించి, "లేదు. టీ పుచ్చుకోడానికి ఆహ్వానిస్తున్నాను. అంగీకారమేనా?" అన్నాడు.

"థాంక్స్. ఈ యుగంలో యజమానులు నౌకర్లను టీపార్టీలకు పిలుస్తారు కాబోలు!"

"అలా కాదు. యజమానులు, నౌకర్లు అనే తారతమ్యం పోయే రోజులు వస్తున్నవి."

"ఓహో! ఎక్కడ పార్టీ?"

"మేడమీద."

వరండాలో కూర్చున్నారు. ముందుగానే నౌకరుతో చెప్పినట్లున్నది—రెండు కప్పులూ, రెండు ప్లేట్లూ మేజామీద పెట్టిఉన్నవి.

"డాక్టరుగారూ, నేను రాకపోయినట్లయితే ఏమి చేసి ఉందురు?"

"ఏడుస్తూ ఒంటరిగా తేనీళ్లు మింగేవాణ్ణి."

"పాపం!"

కొంతసేపు లోకాభిరామాయణం మాట్లాడుకొన్నారు. తటాలున డాక్టర్ ఒక స్వంత ప్రశ్న అడిగాడు.

"లతా, మీకు వివాహమైందా?"

మాధవి కంగారు పడింది. "ఏమో.... ఏమో!" చేతులు నుదుటిమీద నొక్కుకుంది. "నాకేదీ జ్ఞాపకం లేదు."

"ఏదీ లేదా?"

మాధవి కండ్లు మూసుకుంది. "లేదు, లేదు.... లేదు.... అంతా శూన్యం.... అంధకారం!"

"అయ్యో, బాధించాను! క్షమించండి. నేనడిగిందే మరిచిపోండి."

"మీ తప్పేమీ లేదు."

"అది పోనివ్వండి. ఆనందమైన విషయమే మాట్లాడుకొందాము. లతా, ఒక చిన్న ప్రార్థన."

"మీరు నన్ను ప్రార్థించడమా?"

"అవును. మీ పాట వినాలని ఎన్ని రోజులనుంచో అభిలాష. నా కోర్కె మన్నిస్తారా?"

"అయ్యయ్యో! నాకుపాటరాదండీ,చెప్పితేనమ్మరు."

"చారులతాదేవికి పాటరాదంటే నాకు పిచ్చి పట్టిందంటారు. కాదు, కాదు. బహుశా మరిచిపోయి ఉంటారు, మీ చరిత్ర మరిచినట్లు!"

"నా కంతా అయోమయంగా ఉంది."

"పోనీలెండి. నేను పాడతాను, నాకున్న స్వల్ప జ్ఞానంతో. బహుశా విన్నతర్వాత మీలో గుప్తంగా ఉన్న గానం బహిరంగం కావచ్చును."

డాక్టర్ ప్రసన్న మెల్లగా పాడ నారంభించాడు—పీలురాగం. ఏకాగ్రతతో ఆలకిస్తూ ఉంది మాధవి. ఎప్పుడో ఎక్కడో విన్నట్లుంది. ఏవో అవ్యక్తస్మృతులు మొలకలెత్తినవి. దేహం పులకరించింది. సన్నగా ప్రసన్నతో కలిసి పాడ జొచ్చింది. కొన్ని క్షణాల వెనక అతడు తన గానం ఆపేశాడు. మాధవి మాత్రం తన పాట ఆపలేదు. ఆమె జాగ్రదవస్థలో ఉన్నట్లేలేదు. ఆహా! ఎంత మధురమైన కంఠస్వరం! అని మెచ్చుకుంటున్న ప్రసన్నకు ఆకస్మికంగా ఒక పెద్ద సందేహం కలిగింది. ఇది చారులత కంఠస్వరం కాదే! ఎన్నిసార్లో విన్నాడు. ఆమె గొంతు వేరు. బహుశా, రైలు ఆఘాతం వల్ల మారిపోయిందేమో? అది అసంభవం. ఈమె చారులత కాదేమో?

మాధవి పాట ఆపింది. కలగని మేల్కొన్నట్లు చూస్తున్నది.

"ఎంత హాయిగా పాడారు! పాట రాదన్నారే?"

"ఏమో నాకే అర్థంకావడంలేదు."

"అలిసిపోయినట్లున్నారు. ఇక మీకు శ్రమ ఇవ్వను. రేడియో విందామా?" అని డాక్టర్ ప్రసన్న రేడియో తిప్పాడు. వార్తలు, ఆ వెంట భావగీతాలు—కీర్తిశేషులైన శ్రీమతి మాధవి పాడినవి—రికార్డులు—అని ప్రకటన విన్నారు. "నగలూ వద్దూ చీరలు వద్దూ" అని జంఝూటి రాగంలో గేయం. అది వినగానే తనంత తానే ఆ గేయం పాడ తొడిగినది. అరే! ఏమి పోలిక! ఇద్దరి కంఠాలు ఒక్కరీతిగా ఉన్నాయి. డాక్టర్ ప్రసన్నకు ఏమీ తోచలేదు.

ఆ తర్వాత రెండు పాటలుకూడా రేడియోతో కలిసి పాడింది మాధవి.

"మీ కెలా వచ్చు ఈ పాటలు?"

"ఎప్పుడో ఎక్కడో విన్నాను. అంతకన్నా ఏమీ చెప్పలేను."

బాగా చీకటి పడింది. మాధవి సెలవు పుచ్చుకొని వెళ్లిపోయింది. డాక్టర్ దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.


* * * *

ఆ రాత్రి మాధవికి నిద్ర రాలేదు. ప్రశ్న పరంపరతో చిత్తం వ్యాకులమైంది. తానెవరు? తన ఊరేది? తన గతజీవితం ఎలా జరిగింది? తనకు పాట రాదని చెప్పి ఎలా పాడింది? డాక్టర్ ప్రసన్న ఎందుకు తనమీద

అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

అత్యవసర పరిస్థితుల్ని
ఎదుర్కోడానికి
'ఎవరెడి' టార్చిని దగ్గరుంచుకోండి

ఎవరెడి బ్యాటరీ 75వ సంవత్సరం 1890-1965




★ తక్కిన టార్చి లేవీకూడా వీటిలా పనిచేసి ఎక్కువకాలం మన్నవు.
★ అతుకులేనిదృఢమైనవీటిగొట్టాలు అల్యూమినియంతో చేయబడి నందున త్రుప్పు పట్టనే పట్టవు.
★ 'ఎవరెడి' టార్చిలకు నమ్మకంగా బాగా పనిచేసే 'ఎవరెడి' స్విచ్‌లు, ప్రత్యేకమైన రిఫ్లక్టర్లు అమర్చబడి వున్నందున కాంతికిరణాలు సూటిగా, దట్టంగా పడతాయి.
★ మీకు నచ్చిన 'ఎవరెడి' టార్చిని నేడే కొనుక్కోండి!

ఎవరెడి
టైపు నం॥ 3555
రూ॥ 3.50 మాత్రమే
950 నం॥ బ్యాటరీలు— ఒక్కొక్కటి 56 పైసలు మాత్రమే.
పన్నులు అదనం.

ఎవరెడి
టార్చిలు • బ్యాటరీలు
బల్బులు • మ్యాంటిల్సు

యూనియన్ కార్బయిడ్ ఇండియా లిమిటెడ్ UNION CARBIDE

డిస్ట్రిబ్యూటర్లు:
బెజవాడ వెంకన్న అండ్ సన్స్,
మెయిన్ రోడ్డు, రాజమండ్రి-1.

JWTUC-3

# తెర

అంత దయగా ఉన్నాడు? అతని ఉద్దేశమేమి? తన వివాహం గురించి ఎందుకు ప్రశ్నించాడు? ఏ ప్రశ్నకూ సరియైన సమాధానం దొరకలేదు.

తనకేది కర్తవ్యం? నర్సింగ్ హోములో పనిచేస్తూ ఉండిపోవడమా? ఎంతకాలం? డాక్టర్ ప్రసన్నతో సంబంధం ఏ విధంగా పరిణమిస్తుందో? అతని మనసులో అవ్యక్తంగా, గూఢంగా ఉన్న కోర్కె వెల్లడిచేసే తానంగీకరించకపోతే అతని అనురాగం ద్వేషంగా మారి పోవచ్చునేమో? ఆఖరికి ఒక తీర్మానానికి వచ్చింది. తక్షణం వెళ్ళిపోవాలి, అతనితో చెప్పకుండా. ఎక్కడికి? ఏమీ తోచలేదు.

తెల్లవారింది. మాధవి స్నానంచేసి కాఫీ తీసుకొని నర్సింగుహోముకు వెళ్ళడానికి తయారయింది. హోటలు రీడింగురూములో పత్రికలు తిరగేస్తూ కూర్చుంది. తటాలున వార్తాపత్రికలో ఒక ప్రకటన కండ్లపడింది.

"కావలెను.

తెలుగు తెలిసిన యువతి. తల్లిలేని పిల్లవాని సంరక్షణకోసరం. చదువుకూడా నేర్పించవలెయును. ఇంటిపాటునే ఉండడం అవశ్యం. కుటుంబబంధాలున్నవాళ్ళు పనికిరారు. నెలజీతం భోజనాదులుకాక 100/— రూపాయలు. ఉద్యోగం కోరేవారు స్వయంగా తండ్రిని కలుసుకోవలెను. విలాసం: 126/11/బి లాయిడ్స్ రోడ్, మద్రాసు."

చదవగానే మాధవికి తనకు భగవంతుడే మార్గం చూపిస్తున్నట్లు తోచినది. ఏమో? ఇదివరకే ఎవరికన్నా ఆ ఉద్యోగం లభించిందేమో? పోనీ, వెళ్ళిచూద్దాం అనుకుంది.

ఆ రోజు నర్సింగు హోములో గడపడం కష్టమైంది. ఇంత కరుణ తనపై చూపించిన డాక్టర్ ప్రసన్నకు ద్రోహం చేస్తున్నానేమో అని బాధపడ్డది. చెపితే మాత్రం అంగీకరించడు; సందేహంలేదు. అతని మాట నిరాకరించడం బాగుండదు. చెప్పకుండా వెళ్ళిపోవలెనని నిశ్చయించుకుంది.

ఐదు గంటలు కాగానే డాక్టర్‌తో చెప్పింది— "సెలవు" అని. అనాలోచితంగా సమస్కరించింది. కన్నులు తడియైనవి. డాక్టర్ ప్రసన్నకు అర్థంగాని అనుమానం కలిగింది. "ఏమి, ఒక మాదిరిగా ఉన్నారు? ఒంట్లో బాగోలేదా?"

"బాగానే ఉంది. వెళ్తాను."

ఆ రాత్రి మద్రాసుకు రైల్లో బయలుదేరింది. ఎగ్మూరు స్టేషన్‌లో దిగింది. ఒంటరిగా నిలబడి ఉన్న మాధవిని చూచి హోటల్‌వాళ్ళు చుట్టుకున్నారు. లాయిడ్సు రోడ్డుకు సమీపంగా ఉన్నదైతే సుకరం అనుకొని దగ్గర హోటలుకు టాక్సీలో వెళ్ళి ఒక గది పుచ్చుకుంది.

భోజనంచేసి ప్రకటనలో తెలియపరచిన చిరునామా ఇంటికి వెళ్ళింది. ఒక ముసలామె తలుపు తీసింది. లోపలికి వెళ్ళగానే ఇల్లు కొత్తగా కనుపించలేదు. ఎప్పుడో చూచిన భావం కలిగింది. భ్రమ అని తోసి పుచ్చుకుంది.

ప్రకటన అనుసరించి వచ్చినానని చెప్పింది. ముసు

# మిథ్యాబింబాలు

సమయంలో కులీన కుటుంబ స్త్రీల నడుమ కూర్చొని నాటకాన్ని తదేకంగా తిలకిస్తున్న వారి మధ్యనుండి సగంలోనే వెళ్ళిపోయిన ఆ అపూర్వ అలంకార శోభిత ఈమే గదూ? అనుకున్నాడు.

కళ్ళలోని కలవరాన్ని కప్పిపుచ్చుకుంటూ లోపలికి అడుగులువేసి ఆమె మంచం పక్కగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. తనకు దారి చూపిన ఆమె లాంతరు తన ఎదురుగా స్టూలుమీద పెట్టి వాకిట్లోకి వెళ్ళి పోయింది.

ఆమె మౌనంగా అలాగే తదేకంగా సారథి ముఖంలోకి చూస్తూ పడుకొని ఉన్నది. ఆమె ముఖంలో ఏదో అవ్యక్తమైన బాధ ఉన్నట్లుగా పసిగట్టాడు సారథి.

"అనారోగ్యంగా ఉన్నదని కబురుచేశారు. వివరాలు చెబితే మందు ఉదయాన పంపిస్తాను. అసలు మీరు సాయంత్రమే నాకు కబురుచేసి ఉండవలసింది!" అన్నాడు.

"మీరు డాక్టర్లు కదా, వివరాలు చెప్పందే రోగమేదో నిర్ణయించలేరా?" అని చిన్నగా నవ్వి, "ఇక సాయంత్రమే ఎందుకు కబురుచేయలేదంటారా? అప్పటివరకు బాగానే ఉన్నాను!" అన్నది. ఆమె మృదు మధుర కంఠస్వరానికి చకితుడై తలెత్తాడు. ఆమె మాటలెందుకో తనను తేలికపరిచేలా ఉన్నాయనిపించింది.

నిగ్రహించుకొని, "అదికాదు నా ఉద్దేశ్యం. వ్యాధిని నిర్ణయించటంలో మీరు చెప్పే వివరాలు నాకు సహాయకారి కావచ్చు!" అన్నాడు.

ఆమె తిరిగి చిన్నగా నవ్వింది. "అయితే చెప్పక తప్పదంటారా?" అని ఒక్క క్షణమాగి, "డాక్టర్ బాబూ! నాలో ఏదో నాకే తెలియని వ్యాధి ఉన్నది. అది ఇది అని నేను చెప్పలేను. అది ఎందుకు అలా ఏర్పడిందో కూడా చెప్పుకోగలిగే స్థితిలో లేను. కాని, ఆ వ్యాధి మీముందు పరాభూతురాలౌతుందనే ధైర్యం నాకున్నది. అందుకనే మిమ్మల్ని పిలిపించాను!" అని చటుక్కున ముఖం పక్కకు తిప్పుకున్నది.

ఆలా ఒక్క ఉదుటున పక్కకు ముఖం తిప్పుకోవటంలో మెడవరకు ఉన్న దుప్పటి వైదొలగింది. ఆమె పచ్చని ముఖంతోపాటు మెడ కనబడకుండా కప్పివేసిన బంగారు ఆభరణాలుకూడా తళుక్కున మెరిశాయి.

సారథికి ఆమె ప్రథమ దర్శనం ఎంత విచిత్రంగా గోచరించిందో ఇప్పటి ఆమె మాటలూ అంత విచిత్రంగానే ఉన్నాయి. అతడికి ఏమీ అంతుపట్టలేదు.

లేచి నిలబడి, "ఒక్కసారి చేయి చూడనిస్తారా?" అన్నాడు.

ఆమె ఢబుక్కున లేచి కూర్చొని, "చేయిచూచి నా వ్యాధి నిర్ణయం చేయగలిగేపక్షంలో మీరు ఘటికులే, డాక్టర్ బాబూ. అయినా మీ రన్న మాటకు నేనెందుకు అభ్యంతరం చెప్పాలి?" అన్నది. మరుక్షణంలోనే బంగారుతో పోతపోసిన చేయి సారథి కళ్ళముందు తళుక్కున మెరిసింది.

సారథి ఆమె మాటలకు విర్విణ్ణుడయ్యాడు. ఆమె నడతలోకాని, ఆమె మాటల్లోగాని భావం ఏమాత్రం అర్థం కావటం లేదు.

చికాకుకనబరుస్తూ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని, నాడి పరీక్షిస్తూ, "మీ చేష్టలూ, మాటలూ నాకు ఏమీ అర్థం కావటంలేదు. మీరు నన్నెందుకు పిలిపించారో కూడా నాకు తెలియటంలేదు. ఒక సభ్య కుటుంబంలోని వ్యక్తిని అవమానించటానికే మీరు పూనుకున్నట్లయితే మీకది ఎంతమాత్రం తగదని మాత్రం మీముఖానేచెప్పగలను. క్షమించాలి! వస్తాను!" అని వెనుదిరిగి ద్వారంవేపు అడుగులు వేయసాగాడు.

గడప దాటుతుండగా ఆమెవేడినిట్టూర్పులు అతడిని మరింతగా కలవరపరిచినాయి!

తరువాత కొన్ని దినాల వరకు ఆ రోజు రాత్రిజరిగిన సంఘటన మనస్సులో మెదిలినప్పుడు, ఆమె భావాలు అర్థమయినప్పుడు, చీకాకే కాకుండా, రామనాథంగారి అతిలోక సుందరి అయిన మూడవ భార్యమీద అంతులేని అసహ్యమూ, ద్వేషమూ కలిగేవి సారథికి.

(సశేషం)

అనన్య సామాన్య ప్రచారం
గల తెలుగు వార పత్రిక
ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

ట్రేడ్‌మార్కుల రిజిస్ట్రేషన్
ట్రేడ్‌మార్కులు, డిజైన్లు, పేటెంట్లు, కథలు, పాటలువగైరాల కాపీరైట్‌లు వగైరాల అఖిలభారత ప్రభుత్వ రిజిస్ట్రేషను. వివరములు ఉచితం.
దిగువవారికి వ్రాయండి :
ఎల్. ఆర్. స్వామి, తేనాంపేట,
మద్రాసు-18. ఫోన్ : 72509.

# తెర

(15 వ పేజీ తరువాయి)

మీ కేమన్నా కావలిస్తే పనిమనిషి నడగండి" అని చెప్పి మేడమీదికి వెళ్ళిపోయాడు. "ఏమండీ ఏమండీ... నన్ను గుర్తించకపోయారా... మాధవిని— మీ మాధవిని" అందామా అనిపించింది. కాని, నోరు రాలేదు.

ప్రహ్లాద్, తాను హాల్లో ఉండిపోయారు. కళ్ళు తుడుచుకొని, "నాయనా, బొమ్మలు చూద్దామా" అని అడిగింది.

"ఉహూఁ... వద్దు. నీకు పాటలు వచ్చునా?"

"వచ్చును, తండ్రీ."

"అయితే నీవు పాటలు పాడుతూ ఉంటే నిద్రపోతాను. అమ్మ పాడేది నా పక్కమీద కూర్చుని."

మాధవిని ఆస్మృతులు నిశితంగావచ్చి శోకసంతప్తను చేసినవి. కాని, బాబుకోసరం దుఃఖం దిగమింగి, "అలాగే, రా" అని హాల్లో దీపం ఆర్పి ప్రహ్లాద్ గదిలోకి వెళ్ళింది వాడితో. తన పక్కమీద పడుకొన్నాడు ప్రహ్లాద్. దగ్గర కూర్చుని తల నిమురుతూ మాధవి పాడసాగింది.

'అందాల పాప
చిన్నారి పాప ..'

ప్రహ్లాద్ ఉలిక్కిపడ్డాడు. "ఆ పాట మా అమ్మ పాడేది. నీ కెలా వచ్చు?"

"రేడియోలో విని నేర్చుకున్నాను...."

"ఇంకా చాలా వచ్చా మా అమ్మ పాడే పాటలు?"

"ఏమో? నాకు తెలిసినవి పాడతాను." అహో! పసిబాలుడు తన ముద్దుల కొడుకుతో అబద్ధ మాడవలసిన సందర్భం వచ్చింది. విధి విలాసం!

పాడుతూఉంటే ప్రహ్లాద్ నిద్రించాడు. దీపంఆర్పి మంచం మీద కూర్చుంది మాధవి. ఆమె మనోవేదనకు భయపడి నిద్రాదేవి ఆకాశానికి ఎగిరిపోయింది. పూర్వ స్మృతి నశించినది మళ్ళీ ఎందుకు వచ్చింది తనకు? రాకపోతే ఈ దుస్సహమైన బాధ తప్పి ఉండును కదా? కాదు, కాదు అప్పుడు నా ప్రహ్లాదుని చూచిఉండనే— పిచ్చి—అప్పుడు ప్రహ్లాదంటే ఎవరో మరచిపోయింది కదా? ఎందుకు భగవంతుడు నాకీ శిక్ష విధించాడు? ఏ పాపం చెయ్యలేదే? పాప పుణ్యాలు అన్నీ వట్టి కల్పనలు. పోనీ, ఆ గొడవ—విషమ సమస్యలో తగుల్కొన్న తన భవిష్యత్తుకు ఏది మార్గం?'

ఈ విధంగా పరితపిస్తూ ఉన్న మాధవికి ఎవరో దిగి వస్తున్న శబ్దం వినపడింది. కొన్ని క్షణాల తర్వాత ఎవరో టెలిఫోన్‌లో మాట్లాడుతున్నారు. సౌదామిని! అర్ధరాత్రి ఎవరితో మాట్లాడుతుందో—అప్రయత్నంగా మాటలు వినబడుతున్నవి—

"హలో, హలో.... వాసూ.... సారీ! అర్జెంటు గనకనే అర్ధరాత్రిలో మాట్లాడుతున్నాను. ఎవరు? ఆయన నిద్రపోతూన్నాడు గొరక పెడుతూ. వాసూ, వాసూ! నేనిక్కడ ఉండలేనింక—మూడవ నెల అప్పుడే... అయ్యయ్యో! .. ఏమి, ఏమి—నీ శిశువును గర్భంలో పెట్టుకొని ఆయన్ని పెండ్లి చేసుకోమంటున్నావా? అబ్బబ్బ... ఎంత మోసం చేశావు? వాసూ—నిజంగా— ప్రమాణంగా... ఎలాగో ప్రాణాలు బిగబట్టుకొని ఉంటాను—ఒకనెల ముప్పై రోజులు—ముప్పై యుగాలు—డార్లింగ్—డార్లింగ్—ఐ లవ్ యూ—ఐ లవ్‌యూ!"

సంభాషణ ముగించింది. మాధవి తీవ్రంగా ఆలోచించసాగింది. అహో! తన చెల్లెలేనా ఇంత దుర్మార్గానికి సిద్ధమైంది? అయితే భర్త సౌదామినిని పెండ్లి చేసుకోలేదు. అయినా ఆయనతో భార్యవలెనే ప్రవర్తిస్తున్నది. ఎంత ద్రోహం!

ఈ విషయాలన్నీ భర్తతో చెప్పితే? నమ్మడు. సరి కదా వెరాయిదానవు మా గొడవ నీ కెందుకని మందలిస్తాడు. ఎలా సహించడం? వెళ్ళిపోవాలి. మరి, ప్రహ్లాదుడు? హిరణ్యకశిపుని నుంచే రక్షించిన నారాయణుడు తన ప్రహ్లాదుణ్ణి రక్షించడా?

అదుగో! అప్పుడే తూర్పు తెల్లవారుతూంది. గుండె రాయి చేసుకుంది. లేచి ప్రహ్లాద్‌మంచంమీద కూర్చుంది. శాంతంగా నిద్రపోతున్నాడు. మెల్లగా లేపకుండా

నిన్న రాత్రి కలలో కొన్ని ఘట్టాలు ప్రత్యక్షంగా చూచాను — నర్సింగుహోములో చికిత్సమొదలైనవి" అన్నది.

"చాలా సంతోషం! ఏమండీ, నే నివ్వాళ మెయిల్లో మద్రాసు వెళ్ళుతున్నాను. అర్జెంటు కేసు. నా బాల్య స్నేహితుడు అపాయకరమైన స్థితిలో ఉన్నాడు. పెద్ద ఆపరేషను చేస్తే ఒక వేళ బ్రతకవచ్చును. అతడు నన్నే చెయ్యమని కోరాడట. తిరుచినాపల్లికి తంతి ఇస్తే అక్కడవాళ్ళు నాతో ఫోనులో చెప్పారు."

"మద్రాసా? ఎవరో పాపం!"

"శ్రీధర్ అనే ప్రఖ్యాత ఆడిటర్."

"ఆఁ ఆఁ!" మాధవి తల తిరిగింది. తూలి పడి పోయింది. ప్రసన్న పట్టుకున్నాడు.

"ఎలా ఉంది?"

మాలతి మెల్లగా "ఏమిలేదు. నేనుకూడా మీతో మద్రాసు వస్తాను" అన్నది.

"మీరా? ఎందుకు?"

తన చేతులతో కండ్లు కప్పుకొని గద్గదస్వరంతో చెప్పింది: "ఆయన నా భర్త."

* * *

మద్రాసు చేరగానే డాక్టర్ ప్రసన్న, మాధవి శ్రీధర్ ఇంటికి వెళ్ళారు. అప్పటికే అతన్ని సెంటు ఇసబెల్ నర్సింగ్‌హోముకు తీసుకొనివెళ్ళినట్లు చెప్పారు. తక్షణమే అక్కడికి బయలుదేరారు. శ్రీధర్ మత్తుగా పండుకొన్నాడు. డాక్టర్ వేణుగోపాల్ చెప్పాడు—బాధ ఎక్కువగా ఉన్నందున మార్ఫియా ఇంజెక్షన్ ఇచ్చినట్లు. తర్వాత డాక్టర్ ప్రసన్నకు రోగ లక్షణాలన్నీ వర్ణించి ఎక్స్‌రే బొమ్మలు చూపించాడు. డాక్టర్ ప్రసన్న, "సందేహం లేదు. అన్నకోశంలో పుండు ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తూ ఉంది" అన్నాడు. ఆలస్యం చెయ్యకుండా ఆపరేషన్ చెయ్యడం అవశ్యమని తీర్మానించారు. అయితే ఆ రోజు రక్తం ఎక్కించి మరునాడు ఉదయం ఆపరేషన్ చేస్తేనే మంచిదని ప్రసన్న సూచించాడు.

ఇదంతా వింటూ ఉన్న మాధవి తన రక్తం ఇస్తానన్నది. వేణుగోపాల్ ఆశ్చర్యం కనబరిచాడు. అప్పుడు ప్రసన్న మెల్లగా చెప్పాడు—"ఈమె శ్రీధర్‌గారి భార్య" అని. "ఆమె రైల్ ఆక్సిడెంటులో...."

"అవును. అయితే ఆమె జీవించింది. పొరపాటుగా లోకం అన్యథా భావించింది. ఆ కథంతా తర్వాత. ఇప్పుడు రక్తం పరీక్షించి సరిపోతుందేమో కనుక్కోవాలి. లేకపోతే వేరే ఏర్పాటు చేయాలి."

"అలాగే, డాక్టర్."

* * * *

మాధవి రక్తం సరిపోయింది. హృదయపూర్వకంగా మాధవి తన భర్తకు రక్తదానం చేసింది. ఆపరేషన్ రెండు గంటలసేపు పట్టింది. డాక్టర్ ప్రసన్న భయం లేదని ధైర్యం ఇచ్చాడు.

నర్సుతోపాటు మాధవి తన భర్త గదిలోనే ఉండిపోయినది. ఆనాడు సాయంత్రంవరకు స్మరణ రాలేదు శ్రీధర్‌కు. ఎప్పుడైనా సగం కన్ను తెరిచి మూసేవాడు. కాని ప్రపంచజ్ఞానం పూర్తిగా కలగలేదు.

రెండవ రోజు అతను నిద్ర లేవకముందే నర్సు మాధవిని గదిలో కొన్ని రోజుల వరకు రావద్దని చెప్పింది, డాక్టర్ ప్రసన్న ఆజ్ఞప్రకారం శ్రీధర్ మనస్సు చలిస్తుందేమోనని. ప్రహ్లాద్‌నుకూడా రానివ్వలేదు. అయినా మాధవి గదిపక్క వరండాలోనే ఉండేది.

## తెర

క్రమేపి మాధవికి డాక్టర్ ప్రసన్న అంటే గౌరవం, స్నేహభావం ఎక్కువ కాజొచ్చినవి. ఒకరి కొకరు తమ చరిత్రను చెప్పుకున్నారు. ప్రసన్న, శ్రీధర్ ఒకే కాలేజీలో చదువుకున్నారు మొదట. తరవాత మెడికల్ కాలేజీ చేరాడు శ్రీధర్. బి.కామ్. చదివి అకౌంటెంటు పరీక్ష పాసయ్యాడు. మెడికల్ పూర్తి అయిన వెనక ప్రసన్న విదేశాలకు వెళ్ళాడు పై చదువు కోసరం. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసుకొని స్నేహబంధం విడిపోకుండా కాపాడుకొన్నారు. ప్రసన్న దక్షిణంలో పని చేస్తున్నప్పుడు అక్కడ ఒక అమ్మాయిని వివాహం చేసుకొన్నాడు. వారి అనుకూల దాంపత్యం చూచి విధి ఓర్వలేదుకాబోలు, మృత్యు వామెను తన వాత వేసుకొన్నది. అప్పటినుంచి ప్రసన్న జీవితం శూన్యమైపోయింది. తన విద్య లోకులకు వినియోగం చేయడానికే నర్సింగ్ హోము పెట్టాడు. ధనము, ఖ్యాతి గడించాడు కాని స్త్రీ ప్రసక్తి పూర్తిగా అస్పృశ్యమైపోయింది. తన ఉద్యోగం, సంగీతం తప్ప ఇక దేనిమీదా ఆసక్తి లేకపోయింది. అటువంటి తరుణంలో తన జీవితంలో మాధవి ప్రవేశించింది. ఆమె పేరు చారులత అని డాక్టర్ సుబ్రహ్మణ్యం చెప్పాడు. మాధవి తన నర్సింగ్‌హోముకు రావడం, తాను ఆపరేషన్ చెయ్యడం మొదలైన సంగతులు అన్నీ చెప్పాడు. మాధవి నవల చదివినట్లు వింటూ వచ్చింది. అస్పష్టంగా స్మృతులు వచ్చిపోయేవి. అయితే ప్రసన్న మాటలు విశ్వసించకపోలేదు.

మొదట మౌనం ధరించినా తరువాత మాధవి తన విషాద గాథ అంతా చెప్పింది. సౌదామిని విషయం మాత్రం ఎక్కువగా చెప్పలేదు. "మీరు మరణించినారనే నమ్మకంచేత, మీ రూపంలో మార్పు కలగడంవల్ల శ్రీధర్ అలా ప్రవర్తించా"డని స్నేహితుని పక్షంగా మాట్లాడాడు. మాధవి ఊరకుంది.

వారం రోజులకు కట్లు విప్పాడు ప్రసన్న. శ్రీధర్‌కు కొంత సత్తువ చేరుకుంది. ప్రసన్న మాధవిని అతని వద్దకు తీసుకొని వెళ్ళాడు.

"శ్రీధర్, చూడు. నీ కోసరం ఎవరో వచ్చారు" అన్నాడు.

"మీరా? ఎందుకు అలా వెళ్ళిపోయారు—చెప్పకుండా? ప్రహ్లాద్ మీ కోసరం రోజూ ఏడ్చేవాడు."

మాధవి దుఃఖం ఆపుకోలేక పోయింది. కన్నీళ్ళతో చెక్కిళ్ళు తడిచిపోయాయి.

శ్రీధర్ చూచాడు. "అయ్యో, ఏమి అలా ఏడుస్తున్నారు!"

డాక్టర్ ప్రసన్న ఇంక ఆలస్యం చెయ్యకూడదనుకొన్నాడు. "శ్రీధర్! ఆమె ఎవరనుకొన్నావు? నీ మాధవి."

అదిరిపడి శ్రీధర్ లేవబోయాడు. ప్రసన్న, మాధవి కలిసి పడుకోపెట్టారు.

"మాధవి! మాధవి! అయితే...."

"అవును. ఆమె చనిపోలేదు. ప్రబలమైన గాయాలు తగిలినాయి. తిరుచ్చినాపల్లి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. గాయాలు మానినాయి. కాని పూర్వస్మృతి సంపూర్ణంగా నశించింది. తానెవరో కూడా మరిచిపోయింది. అందరూ ఆమె చారులత అనే గాయకి అని అనుకున్నారు, నేను సహా. గాయాలు తగిలిన చోట్లలో గుంటలుపడి, ముఖం అందవిహీనమైపోయింది. నా నర్సింగ్‌హోములో ఉంచుకొని ఆపరేషన్‌చేసి ముఖం సరిచేశాను. ఆ కారణంవల్ల కొంత మారిఉంటుంది..."

ప్రసన్న సాంతం చెప్పాడు కథ— మాధవి మద్రాసు రావడం, హోటల్లో తలకు దెబ్బ తగలగానే పూర్వస్మృతి రావడం, ఇంట్లో పరిస్థితులు-సహించలేక విజయవాడ వెళ్ళిపోవడం. వింటున్నంతసేపూ శ్రీధర్ మాధవినే చూడడం గమనించి ప్రసన్న, "ఇప్పుడే వస్తా"నని చెప్పి వెళ్ళిపోయాడు. మాధవి నిలబడే ఉంది. రుద్ధ స్వరంతో శ్రీధర్, "మాధవీ!" అని పిలిచాడు.

"అబ్బ! ఎన్నాళ్ళకు విన్నాను మీరు అలా పిలవడం!"

"మాధవీ! నన్ను క్షమించవూ?..."

"అలా అనకూడదు. నేనుమాత్రం మిమ్మల్ని అందరినీ మరిచి పోలేదా?"

"అది వేరు. మాధవీ, ఏదో పీడకల కని మేలుకొన్నాం. భగవంతుడు కరుణించాడు."

"అవును. ఒక్క మాట! సౌదామిని ఏమైంది? ఇష్టం లేకపోతే చెప్పకండి."

"మరిచిపో—వాను ఆనేవాడితో లేచిపోయింది."

"నే వనుకొన్నాను. ఆ రాత్రి మీరు నిద్రించిన తర్వాత వాడితో ఫోనులో మాట్లాడింది... అది భరించలేక వెళ్ళిపోయాను."

"మాధవీ! నీవూ, నేనూ, ప్రహ్లాద్—మన కింకెవ్వరితో పనిలేదు."

డాక్టర్ ప్రసన్న ప్రహ్లాద్‌ను వెంటబెట్టుకొని గదిలోకి వచ్చాడు. ప్రహ్లాద్ మాధవిని చూడగానే "అమ్మా" అంటూ పైబడినాడు. మాధవి దగ్గర చేర్చుకొని ముద్దు పెట్టుకుంది.

శ్రీధర్ కళ్ళు చెమ్మగిల్లినాయి. "మాధవీ, ప్రహ్లాద కుమారునికి ఉన్న ప్రేమ, తెలివి నాకు లేకపోయాయి. ఆనాడు నిన్ను చూడగానే 'అమ్మా' అని పిలిచాడు. నా దృష్టికి నేను చేసిన పాపం తెర అడ్డం వచ్చింది. ఏ పాపం ఎరగని వాడికి సత్యం గోచరమైంది."

"ఏమి మాటలు లివి?" అన్నది మాధవి.

"రైట్!" అని అందుకున్నాడు ప్రసన్న. "పడిన బాధలన్నీ ఇప్పుడు మరిచిపోవలసిన సమయం. మీరు ముసలివాళ్ళైనప్పుడు తలుచుకుంటే తమాషాగా ఉంటవి."

"మాధవీ! ప్రసన్న ఎంత మంచివాడో చూచావు కదూ? నీకూ, నాకూ ప్రాణదాత."

"ఆయన ఋణం మనం ఎలా తీర్చుకోగలం?" అనింది మాధవి.

నవ్వుతూ బదులు చెప్పాడు డాక్టర్ ప్రసన్న: "నేను చెప్పనా? మీకు ఇంకొక కొడుకు పుట్టినప్పుడు ప్రసన్న అని పేరుపెట్టుకోండి."

శ్రీధర్ సంతోషంగా నవ్వాడు. మాధవి సిగ్గుతో తల వంచుకొంది. ★